## సుంకేసుల ఎడమ కాలువను...
# తక్షణం నిర్మించాలి

తెలంగాణ ప్రజాఫ్రంట్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేదకుమార్

శాంతినగర్, జూలై 27 (ఆన్‌లైన్): సుంకేసుల ఎడమ కాలువను వెంటనే నిర్మించి తెలంగాణ రైతులను ఆదుకోవాలని తెలంగాణ ప్రజాఫ్రంట్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేదకుమార్ డిమాండ్ చేశారు. మండల కేంద్రం శాంతినగర్‌లో తెలంగాణ ప్రజాఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు మద్దిలేటి అధ్యక్షతన ఆర్డీఎస్ రైతుల సమావేశం శుక్రవారం జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేదకుమార్, రిటైర్డ్ ఎస్ఈ రామకృష్ణారెడ్డి, శ్యాంప్రసాద్‌రెడ్డి హాజరయ్యారు. అంతకుముందు ఉదయం 11 గంటలకు వడ్డేపల్లి మండలం రాజోలి సమీపంలోని సుంకేసుల బ్యారేజీని, ఆ తర్వాత తుంగభద్ర పరివాహక ప్రాంతం టి.గార్లపాడు సమీపంలో ఎత్తిపోతల పథకానికి సంబంధించిన స్థలాన్ని తెలంగాణ రిటైర్డు ఇంజనీర్లు, ప్రజాఫ్రంట్ నాయకులు పరిశీలించారు. అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు ఆర్డీఎస్ రైతుల సమావేశంలో ఇంజనీర్లు, ప్రజాఫ్రంట్ నాయకులు ప్రసంగించారు. ముందుగా వేదకుమార్ మాట్లాడుతూ... సింగరేణి బొగ్గు గనులను, బయ్యారం గనులను రాజకీయ నాయకులు కొల్లగొడుతున్నారని అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో ఉన్న నెట్టెంపాడు, కల్వకుర్తి, బీమా ఎత్తిపోతల పథకాలకు ఇప్పటి వరకు రూ.400 కోట్లు ఖర్చు చేస్తే.. ఒక ఎకరాకు కూడా నీరు పారించలేదన్నారు. రాజోలి సమీపంలోని సుంకేసుల బ్యారేజికి రూ.1200 కోట్లు ఖర్చుచేసి కేసీ కెనాల్ ద్వారా రాయలసీమ నాయకులు నీటిని తరలించుకెళ్తున్నారని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడైనా బ్యారేజీలు నిర్మిస్తే రెండు వైపులా కెనాల్ నిర్మిస్తారు కానీ.. ఇక్కడ మాత్రం తెలంగాణకు అన్యాయం చేసి, కుడి కాల్వను మాత్రమే నిర్మించి.. దాని ద్వారా నీరు తీసుకెళ్లడం విడ్డూరంగా ఉందన్నారు. రాయలసీమలోని కర్నూల్, కడప జిల్లాలకు కేసీ కెనాల్ ద్వారా అధికారికంగానే 3 లక్షల ఎకరాలకు నీరు తీసుకెళ్తుండగా.. తెలంగాణకు మాత్రం 30 వేల ఎకరాలకు కూడా నీరు ఇవ్వడం లేదన్నారు. కేసీ కెనాల్‌కు 100 కి.మీ. దూరంలో ఉన్న రాజోలి బండ డైవర్షన్ స్కీం దగ్గర రాయలసీమ నాయకులు బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, బాల్‌నాగిరెడ్డి బాంబులు పెట్టి ఆనకట్టను పగులగొట్టినా ప్రభుత్వంలో చీమ కుట్టినట్లు కూడా లేదన్నారు. అనంతరం రిటైర్డు ఇంజనీర్లు రామకృష్ణారెడ్డి, శ్యాంప్రసాద్‌రెడ్డిలు మాట్లాడారు. 1944లో నిజాం, మద్రాస్ పాలకులు తుంగభద్రపై నీళ్ళు చెరి సగం వాటా నీరు తీసుకెళ్లాలని నిబంధనలు పెట్టినా రాజకీయ నాయకులు దౌర్జన్యంగా తరలించుకెళ్తున్నారని అన్నారు. 1969లో బచావత్ ట్రిబ్యూనల్‌ను రాయలసీమ నాయకులు తొక్కిపెట్టి నీటిని తీసుకెళ్తున్నారని అన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు మద్దిలేటి మాట్లాడుతూ... సుంకేసుల బ్యారేజి నుంచి కి.మీ. దూరం కాల్వ తవ్వి 9 కి.మీ. దూరం వరకు 2.5 వ్యాసార్థం కలిగిన పైపులైన్‌తో డి.25 నుంచి డి.40 వరకు 50 వేల ఎకరాలకు నీరు పారించొచ్చన్నారు. , రిటైర్డు ఇంజనీర్ విఠల్‌రావు మాట్లాడారు. ఆర్డీఎస్ చైర్మన్ సీతారామిరెడ్డి మాట్లాడుతూ... రాయలసీమ నాయకులు తుంగభద్ర నదిపై 8 రిజర్వాయర్లను నిర్మించి నీటిని తీసుకెళ్తున్నా తెలంగాణ ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ శ్రీనివాసులు వావిలాల సునిత, రాంరెడ్డి, చంద్రశేఖర్‌గౌడ్, నాగేశ్వర్‌రెడ్డి, కిష్టన్న, రాంమోహన్, రాఘవరెడ్డి, రవిరెడ్డి, రాములు, రామకృష్ణ, వెంకట్రాములుగౌడ్, బసవ పూర్ణయ్య పాల్గొన్నారు.





విలేఖరులతో మాట్లాడుతున్న ఇంజనీర్లు; సమావేశంలో మాట్లాడుతున్న వేదకుమార్

## జిల్లాలో విద్యుత్ బకాయిలు..
# రూ.173 కోట్లు

- అప్పు ఇచ్చేందుకు బ్యాంకులు నమ్మడం లేదు
- ఎస్ఈ సదాశివారెడ్డి

బొంరాస్‌పేట, జూలై 27 (ఆన్‌లైన్): జిల్లాలో విద్యుత్ వినియోగదారుల నుంచి రూ.173 కోట్ల బకాయిలు వసూలు కావల్సి ఉందని ఎస్ఈ సదాశివారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మండలంలో ఆకస్మిక పర్యటన చేశారు. విద్యుత్ బిల్లుల వసూళ్లను పరిశీలించిన ఆయన... స్థానిక సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా గృహ వినియోగదారుల నుంచి రూ.62కోట్లు, వాణిజ్యపరంగా రూ.9 కోట్లు, వ్యవసాయ రంగంలో రూ.33 కోట్లు, గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల నుంచి రూ.62 కోట్లు, దేవాలయాల నుంచి రూ. 1కోటి, ఇండస్ట్రీల నుంచి రూ.4 కోట్లు వసూలు కావల్సి ఉందని వివరించారు. అప్పు ఇచ్చేందుకు విద్యుత్‌శాఖను బ్యాంకులు నమ్మడం లేదనే విషయాన్ని వినియోగదారులు గ్రహించి... బిల్లులు సకాలంలో చెల్లించాలని కోరారు. గత ఏప్రిల్ నుంచి మూడు నెలల్లో రూ.11 కోట్ల బిల్లుల వసూళ్లలో వెనుకబడినట్లు తెలిపారు. ఇప్పటి నుంచి ప్రతి నెలా లక్ష్యం నిర్ధేశించుకుని, వసూలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఒక్క నెల బిల్లు చెల్లించకున్నా కనెక్షన్ తొలగించాలన్నారు. వర్షాలు పడకపోవడంతో విద్యుత్ ఉత్పత్తి లేక డిమాండ్ పెరిగి రూ.2కు లభించే ఒక్క యూనిట్.. మార్కెట్‌లో రూ.18కి కూడా దొరకడం లేదన్నారు. విద్యుత్ కోతల గురించి వివరిస్తూ... రంజాన్ మాసంలో కూడా నమాజ్ సమయానికి విద్యుత్‌ను సక్రమంగా అందించలేకపోతున్నామని విచారం వ్యక్తం చేశారు. జిల్లాలో రూ.42 కోట్లతో 50 విద్యుత్ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మండలంలో హకీంపేట నుంచి బొంరాస్‌పేట వరకు రూ.60 లక్షలతో 33 కేవీ విద్యుత్ లైన్ పనులకు ఆమోదం తెలిపినట్లు వివరించారు. ట్రాన్స్‌ఫార్మర్‌ల మరమ్మతు కోసం నియోజకవర్గానికి జూలై మొదటి వారం నుంచి రెండు వాహనాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆర్‌జీజీవై పథకం కింద తండాలకు 10 ట్రాన్స్‌ఫార్మర్‌లు, విద్యుత్ స్తంభాలు అందిస్తున్నామన్నారు. వ్యవసాయ కనెక్షన్‌లలో భాగంగా జిల్లాలో జూలై వరకు 18 వేలు పెండింగ్ కనెక్షన్‌లు ఉన్నాయన్నారు. ఇప్పటికే 6వేల436 కనెక్షన్‌లను రిలీవ్ చేశామన్నారు. ఆయన వెంట కొడంగల్ విద్యుత్ ఏడీ ఆనంద్‌రెడ్డి, బొంరాస్‌పేట ఏఈ రఘునాథచారి ఉన్నారు.

# 'దేశ సేవకు తొలిమెట్టు ఎన్‌సీసీ'

జడ్చర్ల, జూలై 27 (ఆన్‌లైన్): దేశ సేవకు తొలిమెట్టు ఎన్‌సీసీ.. అని కలెక్టర్ గిరిజాశంకర్ అన్నారు. శుక్రవారం జడ్చర్ల డిగ్రీ కళాశాలలో సంయుక్త వార్షిక శిక్షణ క్యాంపు-2 ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో పాల్గొన్న సందర్భంగా ఎన్‌సీసీ విద్యార్థులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. జిల్లాలో ఎన్‌సీసీ శిక్షణ శిబిరాల నిర్వహణకు, పది ఎకరాల స్థలం కేటాయించేందుకు చర్యలు తీసుకుంటానని హామీనిచ్చారు. అలాగే జిల్లాలో సైనిక్ పాఠశాల ఏర్పాటుకు స్థల సేకరణ చేసి, పాఠశాల ఏర్పాటుకు ప్రతిపాదనలను పంపించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఎన్‌సీసీ శిక్షణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పతకాలను అందించారు. కార్యక్రమంలో మహబూబ్‌నగర్ ఆర్డీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎన్‌సీసీ క్యాంప్ కమాండెంట్ కల్నల్ అమర్‌జ్యోతిరాయ్, డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ భక్తవత్సల్‌రెడ్డి, ఎన్‌సీసీ అధికారులు కల్నేల్ సింగ్, రాజేందర్‌సింగ్, కేవీరావు, చందోజీరావు, లక్ష్మణ్, వెంకట్రాములు, తిరుపతిరెడ్డి, రఘు, శోభారాణి, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా వైస్‌చైర్మన్ నటరాజ్, ఖాజాఖుతుబుద్దీన్, జడ్చర్ల లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు పొగాకు ప్రవీణ్, దత్తుకుమార్, సుదర్శన్, పీరాన్, ముటుపూర్‌రవీందర్, తహసీల్దార్ అమరేందర్, ఎంపీడీఓ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.





పదవీ విరమణ ప్రకటనలపై
ఆంధ్రజ్యోతి ఇస్తున్నది
25% డిస్కౌంట్
మీ సహోద్యోగి రిటైరవుతున్నారా. ఆ మరపురాని అనుభూతిని అందరూ అర్థంగా పంచుకునే విశేషంగా మలచండి.
ఆంధ్రజ్యోతి లో ప్రకటనతో వారి శేష జీవితం సుఖమయం కావాలని ఆకాంక్షించండి.



వివరాలకు ఆంధ్రజ్యోతి

వివరాలకు సంప్రదించాల్సిన నంబర్లు
తిరుమలహిల్స్, మయూరీనర్సరి దగ్గర, గ్రా॥ అప్పన్నపల్లి, మహబూబ్‌నగర్, ఫోన్ : 08542-239566,యూనిట్ ఆఫీస్: 9985411365, 9703018480 మహబూబ్‌నగర్ : 9985411175, గద్వాల : 9985625731, కొత్తకోట , వనపర్తి : 9963438024, నారాయణపేట,మక్తల్ : 9985411463, నాగర్‌కర్నూల్, అచ్చంపేట : 9985410905 , షాద్‌నగర్, జడ్చర్ల : 9502441516, కల్వకుర్తి: 9502441516, కొడంగల్ : 08505 - 284222.